4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
శుక్రవారం 5 జూలై 2024
www.ntnews.com

# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

## ఫ్రాన్స్ ఎన్నికల ఫలితాలు

స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే నినాదాన్ని ప్రపంచానికి అందించిన ఫ్రాన్స్‌లో తద్భిన్నమైన విలువలు కలిగిన మితవాద పార్టీలు ఆధిక్యంలోకి వస్తుండటం చారిత్రిక వైచిత్రిగానే కనిపిస్తున్నది. ఇటీవల జరిగిన యురోపియన్ యూనియన్ ఎన్నికల్లో మితవాద పార్టీలు బలపడటాన్ని చూసి ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మ్యాక్రాన్ పార్లమెంట్‌కు మూడేండ్లు ముందుగా మధ్యంతర ఎన్నికలు ప్రకటించారు. అయితే ఆయన ఎత్తుగడ వికటించి వ్యతిరేక ఫలితాలు వచ్చాయి. మ్యాక్రాన్ నేతృత్వంలోని మధ్యేవాద కూటమి వెనుకబడిపోగా, మెరైన్ లెపెన్ నేతృత్వంలోని తీవ్ర జాతీయవాద పక్షమైన నేషనల్ ర్యాలీ (ఆర్‌ఎన్) అనూహ్యంగా ముందుకు దూసుకువచ్చింది. జూన్ 30న జరిగిన ఈ ఎన్నికల్లో ఆర్‌ఎన్‌కు 33 శాతం, వామపక్ష కూటమి న్యూ పాపులర్ ఫ్రంట్‌కు 28 శాతం, మ్యాక్రాన్ కూటమికి 20 శాతం ఓట్లు వచ్చాయి. తీవ్ర జాతీయవాదులు, వామపక్షవాదులు పోటాపోటీగా నిలువగా, మధ్యేవాదులు చాలా వెనుకబడిపోయారని ఫలితాలు సూచిస్తున్నాయి. తొలి విడత పోలింగ్ అనేది ఒక రకంగా క్రీడల్లో క్వాలిఫయింగ్ రౌండ్ లాంటిది. 577 స్థానాలు గల ఫ్రెంచ్ పార్లమెంటులో 289 మ్యాజిక్ ఫిగర్. అంటే ఆ గీత దాటిన పార్టీ లేదా కూటమి అధికారం చేపడుతుంది. అయితే ఏ ఒక్క పార్టీకి గానీ, కూటమికి గానీ స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో నిబంధనల ప్రకారం 7వ తేదీన రెండో విడత పోలింగ్ జరుగుతుంది.

తీవ్ర జాతీయవాద ఆర్‌ఎన్ ఆధిక్యంలోకి రావడంపై పలు వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. జాత్యహంకార, వర్ణ వివక్ష భావాలతో ఆ సంస్థ పురుడు పోసుకోవడమే అందుకు కారణం. కాలక్రమంలో తీవ్ర భావాలను కొంత తగ్గించుకున్నప్పటికీ పూర్తిగా మారిపోయిందని చెప్పగలిగే పరిస్థితి లేదు. శరణార్థుల సంక్షేమానికి చేపట్టే కార్యక్రమాలను ఆ పార్టీ ఇప్పటికీ గట్టిగా వ్యతిరేకిస్తున్నది. అల్జీరియాతో పాటుగా ఫ్రాన్స్ వలస పాలన కింద నలిగిన అనేక తృతీయ ప్రపంచ దేశాలవారు రకరకాల కారణాల వల్ల శరణార్థులుగా వచ్చి ఫ్రాన్స్‌లో స్థిరపడ్డారు. వీరిలో అత్యధికులు మైనారిటీ మతాలకు చెందినవారే. వీరికి వ్యతిరేకంగా మెజారిటీ వర్గాల్లో ఆవేశకావేశాలు రెచ్చగొట్టే విధానాల్లో ఆర్‌ఎన్ తీరు పెద్దగా మారలేదు. అందుకే దేశంలోని మైనారిటీ వర్గాల్లో తాజా ఎన్నికల ఫలితాలపై ఆందోళన వ్యక్తమవుతున్నది. అయితే ఇల్లలకగానే పండుగ కానట్టు అతిపెద్ద గ్రూపుగా ఆర్‌ఎన్ అవతరించినప్పటికీ ఆ పార్టీ దూకుడుకు రెండో విడతలో కళ్లెం వేసేందుకు వామపక్ష, మధ్యేవాద శక్తుల మధ్య పునరేకీకరణ జరుగుతుండటం గమనార్హం.

నిజానికి తీవ్ర జాతీయవాద సమస్య ఒక్క ఫ్రాన్స్‌కే పరిమితం కాదు. దాదాపు యూరప్ దేశాలన్నింటా ఇటీవలి కాలంలో ఈ ధోరణి పెరిగిపోయింది. అమెరికాలోనూ ట్రంప్ వంటి నాయకులు చేస్తున్నది ఇదే. ముఖ్యంగా వలస పాలన సాగించిన దేశాల్లో సమస్య ఎక్కువగా ఉంది. వలసాధిపత్య గత చరిత్ర వల్ల ఏర్పడిన అపరాధ భావన కారణంగా తృతీయ ప్రపంచ దేశాల నుంచి అడ్డూఅదుపూ లేకుండా శరణార్థులను అనుమతించడం జరిగింది. ఇది స్థానికుల్లో వ్యతిరేకతకు దారితీసింది. మాజీ వలస దేశాల నుంచి వచ్చే జనాల పట్ల వ్యతిరేకత రెచ్చగొట్టే రాజకీయాలూ అంతకంతకు పెరిగిపోతున్నాయి. దేశ సంస్కృతి, సంప్రదాయాలపై శరణార్థుల ప్రభావం పడుతున్నదని, వారు స్థానికులకు ఉద్యోగాలు రాకపోవడానికి కారణమవుతున్నారని ఊదరగొట్టే తీవ్ర జాతీయవాదులు ఓటర్లపై ప్రభావం చూపగలుగుతున్నారు. అయితే తీవ్ర జాతీయవాదానికి కొత్తగా బలం పుంజుకుంటున్న వామపక్షవాదం గట్టి పోటీ ఇస్తుండటం విశేషం. ఈ నేపథ్యంలో ఫ్రాన్స్ ఎన్నికల్లో అంతిమ విజేతలుగా ఎవరు నిలుస్తారనేది ఉత్కంఠభరితంగా మారింది.

# ఆ భేటీ వెనుక అసలు కథ



సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**చరిత్రాత్మకమైన తెలంగాణ సాయుధ పోరాటం (1946-1951), 1969 ప్రత్యేక తెలంగాణ తొలి ఉద్యమం, 2001 మలిదశ తెలంగాణ ఉద్యమకాలాల్లో అనేకమంది ఉద్యమకారులను, సాధారణ ప్రజలను, కార్యకర్తలను కోల్పోయిన చరిత్ర మన తెలంగాణది. దశాబ్దాల తరబడి ఉనికి, అస్తిత్వం కోసం నిరంతరం పోరాడుతూ.. పోరాటాల వారసత్వాన్ని చాటుకున్నది మన తెలంగాణ.**

తెలంగాణ ప్రజలు ఎదుర్కొన్న కష్టాలు, బాధలు, తెలంగాణ రైతాంగం అనుభవించిన క్షోభ చంద్రబాబు పాలనలో మరింత రెట్టింపయ్యాయి. తెలంగాణ చరిత్రను రక్తసిక్తం చేసిన పాలకుడు చంద్రబాబు. బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో రక్తం పారించింది చంద్రబాబు పాలన. రెండు, మూడేండ్లలో నీళ్లు ఇచ్చే అవకాశం ఉన్న ఈ ఆధునిక యుగంలో దశాబ్దాల తరబడి ఉద్దేశపూర్వకంగా సాగదీసి తెలంగాణ ప్రాజెక్టులకు పెట్టిన పేరు పెండింగ్ ప్రాజెక్టులు. ఆర్థిక సంస్కరణల పేరుతో, ప్రపంచ బ్యాంకు షరతులతో తెలంగాణ రైతుల నడ్డి విరిచింది చంద్రబాబు ప్రభుత్వం.



బిల్ గేట్స్, బిల్ క్లింటన్, టోని బ్లెయిర్‌లను చూపి, ఆధునికత ముసుగేసి తెలంగాణ సమాజంపై అత్యంత దుర్మార్గమైన వివక్షను చూపింది చంద్రబాబు పాలన. ప్రజాకళాకారుడు, ప్రజా యుద్ధనౌక గద్దర్ వెన్నులో తూటాలు దించడంతో పాటు మరెందరో మెరికల్లాంటి నూతన ప్రపంచాన్ని నిర్మించగలిగే శక్తియుక్తులున్నటువంటి ఒక తరాన్ని నిర్మూలించింది చంద్రబాబు పాలన. తెలంగాణ జనసభ, మహాసభల పేరు మీద మరోసారి తెలంగాణ గొంతుక పైకి లేవగానే బెల్లి లలితను 16 ముక్కలు చేయించింది చంద్రబాబు పరిపాలన. తెలంగాణ కోసం గొంతెత్తిన కవులు, కళాకారులు, రచయితలు, ఉద్యమకారులను నిర్బంధానికి గురిచేసి తెలంగాణలో విధ్వంసాన్ని సృష్టించింది చంద్రబాబు పాలన.

తెలంగాణకు జరిగిన విధ్వంసాన్ని సరిచేసుకునే ప్రయత్నంలో భాగంగా ఎందరో మహామహులు, మేధావులు, త్యాగధనులు, బుద్ధిజీవులు, కార్మికులు, రైతాంగ ప్రతినిధులందరూ గొంతు విప్పి తెలంగాణ సమాజాన్ని మేలుకొల్పుతున్న సమయమది. ఆ సమయంలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్, బియ్యాల జనార్దన్‌రావు, గద్దర్, కేశవరావు జాదవ్, ఆర్.విద్యాసాగర్ రావు, విమలక్క, రామచంద్రమూర్తి, పొత్తూరి వెంకటేశ్వర్ రావు, గాదె ఇన్నయ్య, వి.ప్రకాష్, పాశం యాదగిరి, మల్లెపల్లి లక్ష్మయ్య, ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, జలసాధన సమితి దుశ్చర్ల సత్యనారాయణ, ఆ నాటికీ స్వచ్ఛంగా ఉన్న కోదండరాం వంటి మహామహులెందరో తెలంగాణ కోసం పలుపలు విధాలుగా తమ వాదనను, గొంతును భిన్నరూపాలలో వినిపిస్తూ వస్తున్న సందర్భం. ఓ వైపు అణచివేతను ఎదుర్కొంటూనే, నిర్బంధానికి వ్యతిరేకంగా నిలదొక్కుకుంటూనే తెలంగాణ సమాజాన్ని చైతన్యపరిచి ముందుకు తీసుకుపోయే క్రమం.

ఆ సమయంలో విద్యుత్ సంస్కరణలు చంద్రబాబు నాయుడు పాలన పరాకాష్టకు చేరిందనడానికి గొప్ప ఉదాహరణ. బషీర్‌బాగ్ కాల్పులతో తెలంగాణ సమాజం ఉలిక్కిపడింది. అందరినీ తీవ్ర దిగ్భ్రాంతికి, ఆవేదనకు గురిచేసింది. ఈ ఘటన నేపథ్యంలో అధికార పార్టీలో ఉంటూ ఈ అన్యాయాల పట్ల తొలిసారి నిరసన గళాన్ని విప్పి, 2000 ఆగస్టులో చంద్రబాబుకు బహిరంగ లేఖరాసింది తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, నాటి డిప్యూటీ స్పీకర్ కల్వకుంట్ల చంద్రశేఖర రావు. తెలంగాణ సమాజం ఒక కొత్త ధైర్యాన్ని సంతరించుకునేలా ఆ లేఖ ఒక శంఖారావాన్ని పూరించింది. అనేక మంది తెలంగాణవాదుల్లో కొత్త జవసత్వాలను, కొత్త ఆశలను రేకెత్తించింది.

ఆ తర్వాత జరిగిన మేధోమథనం, చర్చోపచర్చలు వెరసి చంద్రబాబు తీరును నిరసిస్తూ 2001 ఏప్రిల్ 21న తెలుగుదేశం పార్టీ సభ్యత్వానికి, ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ పదవులకు కేసీఆర్ రాజీనామా సమర్పించారు. 2001 ఏప్రిల్ 27న ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నినాదంతో హైదరాబాద్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసం జలదృశ్యంలో 'తెలంగాణ రాష్ట్ర సమితి' పేరిట పార్టీని ఏర్పాటు చేశారు. టీఆర్‌ఎస్ ఆవిర్భావం ఒక అద్భుతం. 14 ఏండ్ల ప్రస్థానం ఒక మహాద్భుతం. విజయతీరాలకు చేరడం చెరిగిపోని చరిత్ర. అంతిమంగా రాష్ట్ర ఏర్పాటు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్, ఆ తర్వాత పదేండ్ల పాలన గురించి అందరికీ తెలిసిందే.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేండ్లకే తెలంగాణ ఉద్యమాన్ని, రాష్ట్ర ఏర్పాటును పరిహసించి, వికటాట్టహాసం చేసినవాళ్లు ప్రగతిభవన్‌లో కలుసుకునే ఒక దుర్దినం, చారిత్రాత్మక ఘోర తప్పిదం మన కండ్లముందే జరగబోతుండటం దురదృష్టకరం. అయితే గతాన్ని నెమరువేసుకుంటే చంద్రబాబు పచ్చి అవకాశవాదంతో తెలంగాణవాదాన్ని అణచివేయాలన్న ప్రయత్నం చేసి విఫలమయ్యారు. గత్యంతరం లేక 2009లో మహాకూటమిని ఏర్పాటు చేశారు. ఓట్ల కోసం తెలంగాణ ప్రజల కాళ్లు మొక్కారు. తెలంగాణ ఏర్పాటును అంగీకరిస్తూ కేంద్రానికి తీర్మానం అందజేశారు. 2009 డిసెంబరు 9న కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చేయగానే ప్లేటు ఫిరాయించి, భారత రాజకీయ వ్యవస్థలో అత్యంత ఘోరంగా రాజకీయ విలువలకు తిలోదకాలిచ్చిన నాయకుడు చంద్రబాబు.

నిస్సిగ్గుగా అంతకుముందు ఇచ్చిన మాటలు, చేసిన వాదనలకు భిన్నంగా తెలంగాణ వ్యతిరేకతను నరనరాన జీర్ణించుకుని, విషం కక్కి ప్రకటన పూర్తయి, ఏర్పాటు మాత్రమే మిగిలున్న తెలంగాణను నాలుగేండ్ల పై చిలుకు ఆపగలిగింది చంద్రబాబు కోటరీ. చంద్రబాబు నాయుడును నిరంతరం వెన్నంటి ఉండే మీడియా, ఆంధ్రా పాలక, పెట్టుబడిదారీ వర్గాలు తెలంగాణ ప్రజలను, సమాజాన్ని పరిహసించాయి. కానీ, అంతిమ విజయం ధర్మానిదే అయింది. అయితే చరిత్రలో అత్యంత విషాదకర, మరువలేని, మరపురాని ఘటనలు ఈ నాలుగేండ్లలో చోటుచేసుకున్నాయి. నిరాశ, నిస్పృహలకు గురైన వందలాదిమంది యువకుల బలిదానాలు, ఆ కుటుంబాల ఆవేదన, దుఖం ఒక శాశ్వత గాయంగా తెలంగాణ సమాజం మీద ముద్రితమైంది.

> ఆ గాయాలు మానకముందే ఈ రోజు చంద్రబాబు నాయుడు, ఆయన శిష్యుడు రేవంత్ రెడ్డి (తెలంగాణను వ్యతిరేకించిన ధీరోధాత్తులు) తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపమైన ప్రగతిభవన్‌లో (తెలంగాణ వ్యతిరేకుల) కలయిక జరగబోతున్నది. ఆహా ఎంత అద్భుతం! ఇందుకేనా అంతమంది అమరులైంది? ఇందుకేనా దశాబ్దాల పాటు తెలంగాణ గళాన్ని ప్రజలు వినిపించింది? ఓహో ఇందుకేనా వేల మంది కవులు, కళాకారులు తమ గళం విప్పింది, గర్జన చేసింది, పాటలు పాడింది? ఓహో ఇందుకేనా తెలంగాణ సమాజం సకలజనుల సమ్మె చేసింది? ఓహో ఇందుకేనా అంతా ఒక్కటై నిలిచింది? ఎంతటి విషాదమిది.

ఒకవేళ నిజంగానే రెండు విడిపోయిన రాష్ట్రాలు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని అనుకుంటే ఇదే చంద్రబాబు రాష్ట్రం విడిపోయినప్పుడు 2014లో ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్నారు. మరి 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎందుకు కలిసే ప్రయత్నం చేయలేదు? ఈ రోజు చూపిన చొరవ ఆ రోజు ఎందుకు చూపలేదు? ఎందుకు సీలేరును గుంజుకున్నారు? ఎందుకు తెలంగాణలోని ఏడు మండలాలను గుంజుకున్నారు? ఏపీ హైకోర్టు ఏర్పాటులో జరిగిన జాప్యానికి కారణమెవరు? అప్పట్లో గుంజుకోవడమే కాదు, ఇటీవల ఏపీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత పార్టీ ప్రజాప్రతినిధుల సమావేశంలో నిస్సిగ్గుగా తాను ఎలా బెదిరించి ఏడు మండలాలను లాక్కున్నది కూడా ఏపీ ప్రజలు, పార్టీకి ఆయన వివరించారు.

> అపరిష్కృత సమస్యలను పరిష్కారం చేసుకోవాలన్న సోయి అప్పట్లో ఎందుకు లేకపోయింది? ఒకవేళ కేసీఆర్ సహకరించలేదనుకుంటే చంద్రబాబు స్నేహహస్తం చాచింది ఎప్పుడు? నాడు ఎన్డీయేలో టీడీపీ భాగస్వామి కాబట్టి, చంద్రబాబు చెప్పినట్టు ప్రధాని మోదీ వినేవారు. అందుకే నదీజలాలు, ఉమ్మడి ఆస్తుల పంపిణీ, హైకోర్టు ఏర్పాటు వంటి వీలైనన్నీ అంశాలను వాయిదా వేయిస్తూ దుర్మార్గానికి పాల్పడ్డారు చంద్రబాబు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో సమస్యల పరిష్కారానికి కొన్ని అడుగులు వేసినా.. కేసీఆర్ అనేకసార్లు చెప్పినట్టు తెలంగాణ వ్యతిరేకులంతా ఎప్పుడూ ఒక్కటే. దాన్ని తెలంగాణ సమాజం ఎన్నడూ మరిచిపోదు. కొద్దిగా ఎక్కువ, తక్కువ అంతే.

ఒకవేళ రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా రెండు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం చొరవ తీసుకోదలుచుకుంటే, నిజంగా పరిష్కారం కావాలని అనుకుంటే గనుక.. ఈ రాష్ట్రంలోని రాజకీయ పక్షాలన్నింటినీ పిలిచి మొదట అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఉండాల్సింది. ఏయే అంశాలు ఎందుకు అపరిష్కృతంగా ఉన్నాయి? ఏ మేరకు ఉన్నాయి? మనమేం చొరవ చూపాలి? ఏం అడగాలి? అని కనీస కసరత్తు చేయాల్సింది. కానీ, అలా చేయలేదు. ఏ కసరత్తు చేయకుండానే చర్చలకు వెళ్లడం ఎంత వరకు సమంజసం? చంద్రబాబు ఇలా లేఖ రాయగానే అలా రేవంత్ ఎందుకు తలూపుతున్నారు? చంద్రబాబు పంపిన లేఖ పైకి కనిపిస్తున్నది. కానీ, వారి మధ్య మాటామంతీ రోజూ నడుస్తున్నదే. ఇప్పుడు తెలంగాణను పరోక్షంగా పాలిస్తున్నది చంద్రబాబే. రేపూ చంద్రబాబే నడుపుతారు. ప్రగతి భవన్‌లో కాలు మోపడం ద్వారా హైదరాబాద్‌లో 'నా పెత్తన నడుస్తుంది. నాదే నడుస్తది' అని పరోక్షంగా ఆంధ్రా ప్రాంతానికి తెలియజేయడమే ఆయన ఉద్దేశం. తద్వారా ఆంధ్రా పెట్టుబడిదారి వర్గాలను, తెలంగాణ వ్యతిరేక వర్గాలను సంఘటితం చేయడమే చంద్రబాబు కుటిలనీతి. తెలంగాణ సమాజమా ఇది కాలపరీక్ష. తెలంగాణ వ్యతిరేకుల కుట్రల నుంచి మనల్ని మనం కాపాడుకుందాం. తెలంగాణను కాపాడుకుందాం.

**(వ్యాసకర్త: రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి)**

# గురుశిష్యుల గూడుపుఠాణి!

**తెలంగాణలో కుట్ర రాజకీయాల దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. తెలంగాణ ఆత్మగౌరవం, అస్తిత్వంపై ఆధిపత్యం కోసం ఏపీ సీఎం చంద్రబాబు మళ్లీ పావులు కదుపుతున్నారు. తన శిష్యుడు రేవంత్‌రెడ్డి తెలంగాణ సీఎం కావడంతో బాబుకు ఇప్పుడు కొత్త ఆశలు చిగురిస్తున్నట్టున్నాయి. 2014లో విభజన హామీలను గాలికొదిలేసి రాత్రికిరాత్రే ఏపీకి పలాయనం చిత్తగించిన చంద్రబాబు.. ఇప్పుడు హఠాత్తుగా హామీలంటూ డ్రామాలెందుకు మొదలుపెట్టారు. నిజంగానే చంద్రబాబుకు విభజన సమస్యల గురించి చర్చించే ఉద్దేశం ఉందా? లేదా తన మనసులో ఇంకేదైనా ఉందా? అనేది ఇప్పుడు అందరి మెదళ్లను తొలుస్తున్న ప్రశ్న.**



తోటకూర రమేశ్

## సీఎంల భేటీ రాజకీయం-1




బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్న తొమ్మిదిన్నరేండ్లలో తెలంగాణ వైపు కన్నెత్తి చూసేందుకు గజగజ వణికినవారు ఇప్పుడు ఏకంగా తెలంగాణ సంపదపై ఆధిపత్యం కోసం ఎత్తుగడలు వేసుకుంటున్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో ఆంధ్రా ఆధిపత్యవర్గాల కుట్రలను తెలంగాణ ప్రజలు తిప్పికొడుతూనే ఉన్నారు. తెలంగాణకు అవమానం జరిగిన ప్రతీసారి ప్రజలు ముక్తకంఠంతో తెలంగాణవాదాన్ని గట్టిగా వినిపిస్తూనే ఉన్నారు. గత డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో సర్కార్ మారడంతో సమైక్యవాదులు మళ్లీ తెలంగాణపై కన్నేశారు. తెలంగాణ ఉద్యమంతో గానీ, తెలంగాణ ఆత్మగౌరవం, అస్తిత్వంతో గానీ సంబంధం లేని వ్యక్తి అయిన రేవంత్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండటంతో ఆర్థిక దోపిడీదారులకు మరోసారి తెలంగాణ మీద ఆశలు చిగురిస్తున్నట్టున్నాయి.

నిజానికి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీఎంగా ఉన్నప్పటికీ.. ఆ పార్టీ కార్యకర్తలు ఎప్పుడూ ఆయనను తమవాడిగా భావించడం లేదు. పైగా తెలంగాణ ఉద్యమంతో రేవంత్‌రెడ్డికి ఎలాంటి పేగుబంధం లేకపోవడం, ఉద్యమకారులపై తుపాకీ ఎక్కుపెట్టిన గత చరిత్ర ఉండటంతో ప్రజలకు ఆయనపై నమ్మకం కుదరడం లేదు. టెక్నికల్‌గా రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో ఉన్నప్పటికీ ఆయన ఆత్మ మొత్తం టీడీపీ అధినేత చంద్రబాబుతోనే ఉందన్న విమర్శలు అటు కాంగ్రెస్ శ్రేణుల నుంచి ఇటు తెలంగాణ సమాజం నుంచి సర్వత్రా వినిపిస్తున్నాయి. అంతేకాదు, తెలంగాణ ప్రజలు సీఎం రేవంత్‌రెడ్డిని 'మావాడు కాద'నుకుంటుంటే.. సమైక్యవాదులు, టీడీపీ శ్రేణులు మాత్రం రేవంత్‌రెడ్డిని ఓన్ చేసుకుంటున్నారు. 'మా సీఎం.. మా రేవంత్‌రెడ్డి.. మా టీడీపీ మొక్క' అని ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ అస్తిత్వంపై పదేండ్ల తర్వాత దండయాత్ర చేసేందుకు తెలంగాణ వ్యతిరేక శక్తులు ఒక్కటవుతున్నాయి.

ఏపీలో అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు తెలంగాణపై ఫోకస్ పెట్టారు. ఏపీ పాలనాధికారం చేతిలో ఉండటం, కేంద్రంలో కింగ్‌మేకర్ కావడంతో ఆయన ధోరణి మారింది. ఈ నేపథ్యంలోనే ఏపీ విభజన చట్టంలోని సమస్యలు అంటూ కొత్త రాజకీయ వ్యూహాలను ఆయన తెరపైకి తీసుకువచ్చారు. వాస్తవానికి తెలంగాణ ఏర్పాటును టీడీపీ గట్టిగా వ్యతిరేకించింది. తెలంగాణ ఏర్పాటు సుతరాం ఇష్టం లేని చంద్రబాబు ప్రజలను మోసం చేసేందుకు నామ్‌కే వాస్తే రెండుకండ్ల సిద్ధాంతంతో అప్పటి యూపీఏ ప్రభుత్వానికి లేఖ ఇచ్చారు. అనేక సంఘర్షణలు, చర్చలు, లాబీయింగ్‌ల తర్వాత తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది. అయితే విభజన చట్టంలో అప్పటి యూపీఏ ప్రభుత్వం అనేక అంశాలను పొందుపర్చింది. తెలుగు రాష్ట్రాల మధ్య ఆస్తులు, అప్పుల పంపిణీ సహా ఇతర అంశాలను జటిలంగా మార్చింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత అనేక విభజన అంశాలు పరిష్కరించకుండా బీజేపీ సర్కార్ తెలుగు రాష్ట్రాలకు అన్యాయం చేసింది. తెలంగాణ అభివృద్ధికి విభజన చట్టంలోని కొన్ని అంశాలు అడ్డుగా ఉన్నాయని అప్పటి సీఎం కేసీఆర్ వాటి పరిష్కారం కోసం కేంద్రంపై అనేక రకాలుగా ఒత్తిడి తీసుకువచ్చారు. సీఎం హోదాలో కేసీఆర్ ప్రధానిని కలిసి విన్నవించారు. కేంద్ర హోం శాఖకు లెక్కలేనన్ని లేఖలు రాశారు. బీఆర్‌ఎస్ ఎంపీలు పార్లమెంట్ లోపల, వెలుపల అనేక పోరాటాలు చేశారు. అయినా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణ ప్రజల గోసను పట్టించుకోలేదు. ఉభయ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలను గుప్పిట్లో పెట్టుకునేందుకు విభజన హామీలను మరింత జటిలంగా మార్చింది.

2014లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో టీడీపీ భాగస్వామిగా ఉంది. అయినా విభజన చట్టంలోని అంశాల పరిష్కారంపై చంద్రబాబు దృష్టి పెట్టలేదు. ఆ తర్వాత రాత్రికిరాత్రే హైదరాబాద్ నుంచి విజయవాడకు మకాం మార్చారు. ఆ తర్వాత కూడా చంద్రబాబు ఎప్పుడూ విభజన హామీల గురించి కేంద్రంపై ఒత్తిడి తీసుకురాలేదు. అంతేకాకుండా తెలంగాణలోని ఏడు మండలాలను అక్రమంగా ఏపీలో కలుపుకొన్నారు. తెలంగాణలోని ఏడు మండలాలను ఏపీలో కలిపితేనే ప్రమాణస్వీకారం చేస్తానని కేంద్రాన్ని బెదిరించినట్టు స్వయంగా చంద్రబాబే అంగీకరించారు.

చంద్రబాబు ఇప్పుడు మరోసారి తెలంగాణను తన గుప్పిట పెట్టుకోవాలని చూస్తున్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నన్నాళ్లు తెలంగాణ రాజకీయాల్లో వేలు పెట్టేందుకు జంకిన చంద్రబాబు ఇప్పుడు కేసీఆర్ దిగిపోగానే తన వ్యూహాలకు పదును పెడుతున్నారు. తెలంగాణపై పెత్తనం చెలాయించేందుకు విభజన సమస్యలను ఒక అవకాశంగా మార్చుకున్నారు. తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యక్షంగా వేలుపెడితే.. రాష్ట్ర ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుంది. కాబట్టి దొడ్డిదారిలో ప్రవేశించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఏపీలో అధికారంలోకి వచ్చిన రెండు వారాల్లోనే విభజన హామీలపై చర్చిద్దామంటూ రేవంత్‌రెడ్డికి లేఖ రాయడంపై తెలంగాణ ప్రజలు, ఉద్యమకారుల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాబు కుట్రలపై తెలంగాణ సమాజం ఆందోళన చెందుతున్నది. నిజానికి విభజన హామీల పరిష్కారం రెండు రాష్ట్రాలకు మేలు చేసేదే. కానీ, విభజన చట్టాన్ని అడ్డుపెట్టుకుని చంద్రబాబు తెలంగాణ ప్రభుత్వ వ్యవహారాల్లో వేలుపెడితే మాత్రం మన రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతుంది. సీఎం రేవంత్‌రెడ్డితో ఉన్న సాన్నిహిత్యాన్ని అడ్డుపెట్టుకుని తెలంగాణను విఫల రాష్ట్రంగా మార్చి, ఇక్కడి వ్యాపార సంస్థలను ఏపీకి తరలించే వ్యూహంతో చంద్రబాబు రాష్ట్రానికి వస్తున్నట్టు కనిపిస్తున్నది. ఇప్పటికే గత ఆరు నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ విధ్వంసమైంది. ఇప్పుడు విభజన సమస్యలంటూ రాష్ట్రంలోకి శకునిలా చంద్రబాబు ప్రవేశిస్తున్నారని మండిపడుతున్నారు తెలంగాణ వాదులు.

విభజన హామీలపై చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ఏపీ సీఎం చంద్రబాబు లేఖ రాయడం వెనుక తెలుగు రాష్ట్రాల్లో అనేక రాజకీయ పరిణామాలు జరిగాయి. ఏపీలో వైసీపీని ఓడించేందుకు టీడీపీ, జనసేనతో కలిసి బీజేపీ చేసిన ప్రయోగం విజయవంతమైంది. ఏపీలో ఆ మూడు పార్టీల టాస్క్ పూర్తికావడంతో వారి కన్ను ఇప్పుడు తెలంగాణపై పడింది. ఆ కూటమి పేరిట తెలంగాణలో పాగా వేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ కుట్రలో చంద్రబాబు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. విభజన హామీల పేరుతో తెలంగాణ రాష్ట్రంపై ఆధిపత్యం సాధించి.. కూటమి బలం పెంచుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తెలంగాణలో బీజేపీ, టీడీపీ తమ పొలిటికల్ గేమ్ స్టార్ట్ చేశాయి. ఇందుకు గవర్నర్ వ్యవస్థను బీజేపీ వాడుకుంది. ప్రభుత్వాలను కూల్చడంలో గవర్నర్ వ్యవస్థను బీజేపీ ఎలా దుర్వినియోగం చేసిందో తెలిసిందే. ఇప్పుడు అలాంటి ప్రయత్నాలే తెలంగాణ కేంద్రంగా చేస్తున్నది. ఈ ప్లాన్‌లో భాగంగానే చంద్రబాబు సీఎం అయిన వెంటనే తెలంగాణ గవర్నర్ ఏపీలో పర్యటించారు. తన పర్యటనలో చంద్రబాబుతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఆ రోజే తెలంగాణలో కుట్ర రాజకీయాలకు బీజం పడిందన్న వాదనను తెలంగాణ వాదులు బలంగా వినిపిస్తున్నారు. ప్రొటోకాల్‌కు పూర్తి విరుద్ధంగా తెలంగాణ గవర్నర్, ఏపీ సీఎం చంద్రబాబును కలవడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. బీజేపీ హైకమాండ్ ఆదేశాల మేరకు ఆ సమావేశంలోనే తెలంగాణలో ఎలాంటి రాజకీయాలు చేయాలో చర్చించారన్న టాక్ బలంగా వినిపించింది.

చంద్రబాబుతో తెలంగాణ గవర్నర్ భేటీ జరిగిన వారం రోజుల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి గవర్నర్‌ను కలిశారు. ఈ భేటీపై తెలంగాణ ప్రజల్లో అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. తన గురువు చంద్రబాబు ఏం కబురు పంపారో తెలుసుకునేందుకే గవర్నర్‌ను రేవంత్‌రెడ్డి కలిశారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాదు, ఇప్పటికే ఏపీలో బలం పెంచుకున్న బీజేపీ తెలంగాణలోనూ పూర్తిస్థాయి రాజకీయ పట్టు సాధించేందుకు గవర్నర్ వ్యవస్థను వాడుకుంటున్నదనే ఆరోపణలు వస్తున్నాయి.

**(ఇంకా ఉంది)**

**లేఖ**

## టీచర్ పోస్టులు పెంచాలె!

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం వెనుక నిరుద్యోగుల పాత్ర ఎనలేనిది. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని, 25 వేల టీచర్ కొలువులను భర్తీ చేస్తామని అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నేతలు హామీ ఇవ్వడంతో ముఖ్యంగా డీఎస్సీ అభ్యర్థులు ఆ పార్టీకి మద్దతుగా నిలిచారు. అంతేకాకుండా, ఎంతోమంది అభ్యర్థులు హస్తం పార్టీకి మద్దతుగా క్షేత్రస్థాయిలోనూ పనిచేశారు. అయితే నిరుద్యోగుల వెతలనే మెట్లుగా మలచుకొని, అందలమెక్కిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు వారిని విస్మరిస్తున్నది.

> మెగా డీఎస్సీ అని చెప్పి, గత ప్రభుత్వం జారీ చేసిన 5089 టీచర్ పోస్టులకు అదనంగా మరో 6 వేల పోస్టులు జత చేసి 11,062 పోస్టులతో నోటిఫికేషన్ ఇవ్వడం సరికాదు. ప్రస్తుత నోటిఫికేషన్‌లో జిల్లాల వారీగా చూస్తే.. చాలా తక్కువ పోస్టులున్నాయి. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు సింగిల్ డిజిట్‌లోనే ఉండటం గమనార్హం. ఎస్జీటీ పోస్టులు కూడా తక్కువ సంఖ్యలోనే ఉన్నాయి. దీంతో తీవ్ర పోటీ నెలకొన్నది. ఖాళీలు ఉన్నప్పటికీ భర్తీ చేయకపోవడం విచారకరం. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన టీచర్ల బదిలీలు, ప్రమోషన్ల ద్వారానే సుమారుగా 10 వేల ఉపాధ్యాయ ఖాళీలు ఏర్పడే అవకాశం ఉన్నది. ఈ ఖాళీలను కూడా ప్రస్తుత డీఎస్సీ నోటిఫికేషన్‌కు జతచేయాలి.

హేతుబద్ధీకరణ పేరిట టీచర్ పోస్టులను కుదించకూడదు. బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ పూర్తయ్యాక మిగిలిన ఖాళీలను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలి. అలా చేస్తే గ్రామీణ ప్రాంతాల్లోనూ టీచర్లు అందుబాటులో ఉంటారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయి. అలాగే డీఎస్సీ పరీక్షకు సన్నద్ధమయ్యేందుకు తక్కువ సమయం ఇవ్వడం సరికాదు. మరో నెల రోజులు గడువు పెంచి సెప్టెంబర్‌లో పరీక్షలు నిర్వహించాలి. తద్వారా లక్షల మంది నిరుద్యోగులకు న్యాయం జరుగుతుంది.

**- రావుల రామ్మోహన్‌రెడ్డి, డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు**

## సదుపాయాలు లేకనే అమాయకులు బలి!



ఉత్తరప్రదేశ్‌లో వైద్య రంగం అధ్వానంగా తయారైంది. సరైన సమయంలో చికిత్స అందకపోవడంతోనే హాథ్రస్ ఘటనలో అమాయకులు చనిపోయారు. రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాలలను నిర్మిస్తున్నామని చెప్తున్న యోగి ఆదిత్యనాథ్ సర్కార్ ఉన్నవాటిని భ్రష్టుపట్టించింది. రాష్ట్రంలో హెల్త్‌కేర్ కంటే పొలిటికల్ హెల్త్‌పైనే ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దృష్టిసారిస్తున్నారు.

**- అఖిలేశ్ యాదవ్,** యూపీ మాజీ ముఖ్యమంత్రి

